# అక్షర జ్యోతి అహ్హాహ్హా




**"కే**రళ నూటికి నూరు శాతం అక్షరాస్యత సాధించిందట" న్యూస్ పేపర్ పట్టుకుని మా ఇంటికొస్తూ అన్నాడు రంగారెడ్డి.

అప్పటికే మా ఇంటి దగ్గర శాయిరామ్, జనార్ధన్, యాదగిరి, గోపాల్రావ్, పార్వతీదేవి అంతా పోగయి ఉన్నారు.

రంగారెడ్డి డైలాగ్ వింటూనే నేను పగలబడి నవ్వేను.

నేను నవ్వటం చూసి మిగతావాళ్ళు కూడా నవ్వసాగాడు.

"ఏమిటి ఎందుకు నవ్వుతున్నారు?" అడిగాడు రంగారెడ్డి.

"నవ్వు రాకుండా ఎలా వుంటుంది గురూ? నూటికి నూరు శాతం అక్షరాస్యత–ఓహ్హోహ్హోహ్హోహో"

అంటూ మళ్ళీ నవ్వేయసాగాడు గోపాల్రావ్.

"జబర్దస్త్ జోక్ అన్నా" అన్నాడు యాదగిరి కూడా నవ్వలేక కిందపడి దొల్లుతూ–

"అరె! పేపర్‌లో క్లియర్‌గా దాని వివరాలిచ్చారయ్యా! జర్నలిస్ట్‌లేం అల్లాటప్పావాళ్ళు కాదు ఇష్టమొచ్చినట్లు రాసేయడానికి. మంచిగ నిజాయితీతో రాస్తారు–" అన్నాడు

రంగారెడ్డి.

ఆ మాట వినగానే గోపాల్రావ్‌తో సహా మేమంతా పగలబడి నవ్వేయసాగాం మళ్ళీ.

"నీ యవ్వ ఇది ఇంకా జబర్దస్త్ జోక్‌గా ఉన్నది భాయ్. జర్నలిస్ట్‌లంతా నిజాయితీతోటి రాస్తారంట."

అందరం ఐదు నిమిషాలు నవ్వుకుంటూ కళ్ళవెంబడి జారుతున్న కన్నీటిని తుడుచుకున్నాం. సరిగ్గా వారం గడిచేసరికి శాయిరామ్ హడావుడిగా, ఓ న్యూస్ పేపర్ తీసుకుని తెగ ఎగ్జయిట్ అయిపోతూ వచ్చాడు. మేమందరం వేదిక దగ్గర వెన్నెల్లో కూర్చుని పిచ్చాపాటి మాట్లాడుకుంటూండగా.

"గురూ! అద్భుతమైన వార్త! మన ఆంధ్రప్రదేశ్ కూడా అక్షరజ్యోతి స్కీమ్ ప్రారంభించిందట" అన్నాడతను.

మాకతని మాటలేం అర్థం కాలేదు.

"అక్షరజ్యోతా? అంటే ఏమిటి?"

"అంటే మన రాష్ట్రం కూడా కేరళ రాష్ట్రంలాగానే నూరుపాళ్ళు అక్షరాస్యత సాధించేస్తుం దన్నమాట!"

ఆ మాట వింటూనే మళ్ళీ అందరూ పగలబడి నవ్వారు.

"ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్– నీయవ్వ– భల్ దిల్దార్ జోకులేస్తుందన్నా! ఇంకేరాష్ట్రానికీ గింత సెన్సాఫ్ హ్యూమర్ లేదు." అన్నాడు జనార్ధన్.

"అలా నవ్వకూడదు భాయ్! చాలా తప్పు పని చేస్తున్రు" అన్నాడు యాదగిరి.

"ఎందుకని నవ్వకూడదు?"

"ఎందుకంటే మన ఆంధ్రప్రదేశ్‌ని మీరు తక్కువ అంచనా వేస్తున్రు. మన తెలుగు ప్రజల సంగతి మీకెరుకలేదు. తిక్క లేచిందంటే ఒక్క రోజుల పబ్లికంతా అక్షరాస్యులయి పోతారు– అంతా కెపాసిటీ ఉందాళ్ళకు" అతనిని శాయిరామ్ సపోర్ట్ చేశాడు.

శాయిరామ్‌కీ మధ్య తెలుగు ప్రజల మీద అభిమానం ఎక్కువైందన్న విషయం మాకు తెలుసు. అందుకని అతన్ని నిరుత్సాహ పరచటం ఇష్టంలేక వూరుకున్నాం.

"మనం కూడా ప్రభుత్వంతో సహకరిస్తే నూరుశాతం అక్షరాస్యత క్షణాల్లో సాధించవచ్చు" అన్నాడు గోపాల్రావ్ అతికష్టం మీద నవ్వాపుకుంటూ.

"మన కాలనీ వాళ్ళందరం కూడా ఈ స్కీమ్‌లో చేరి నిరక్షరాస్యతను ఎదుర్కొందాం" అన్నాడు రంగారెడ్డి మరింత వుత్సాహంతో.

"మనమా!" ఉక్కిరి బిక్కిరౌతూ అడిగాడు జనార్ధన్.

"అవును! మన రాష్ట్రానికి మనం చేసుకోకపోతే ఇంకెవరు చేస్తారు?" అంది పార్వతీదేవి

ఆమె కీమధ్య దేశభక్తి ఎక్కువయిపోయింది. ఉండుండి 'రామ్ ఔర్ రోటీ' అంటోంది.

"మంచి పద్ధతి ఏమటంటే అదివరకు లాగానే మన కాలనీ వాళ్ళందరం కలసి ఆదిమానవులు అనే అడవిజాతిని నాగరీకులుగా చేసే కార్యక్రమం విజయవంతంగా అమలుపరచాం కదా!" అన్నాడు చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్.

ఆ ఆలోచన నిజంగానే అందరికీ ఉత్సాహం కలిగించింది.

ఎందుకంటే ఎదుటివాడికి తెలియని విషయాలు చెప్పటం మా అందరికి భలే సరదా!

అందులో చదువురాని వాళ్ళకు చదువు చెప్పటానికి మా కాలనీలో ఆడామగా అందరూ ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉన్నారు.

ఎటోచ్చీ నేర్చుకునే వారెవరూ దొరకకపోవటంవల్ల అందరి కోరికలూ అలానే అణగారి ఉండిపోయినయ్. చాలామంది తమ పిల్లల మీదనే ఆ కోరిక తీర్చుకోవాలను కున్నారు గానీ ఈ రోజుల్లో సిలబస్‌కి ఆ రోజుల్లో మేము నేర్చుకున్న సిలబస్‌కి చాలా తేడా వుండడంతో మా కోరిక నెరవేరలేదు.

మా ప్రపోజల్ వినడంతోనే మా కాలనీ వాళ్ళంతా కూడా మేము చదువు చెప్తాం అంటే మేము చెప్తాం అంటూ పోటీలుపడి రంగారెడ్డి దగ్గర పేర్లు నమోదు చేయించుకో సాగారు.

సాయంత్రం మయేసరికి లిస్ట్‌లో పేర్లు మూడొందల అరవై అయిదుకి చేరినయ్.

"ఇప్పుడేం చేయాలి మనం!" అడిగాడు గోపాల్రావ్.

"ఏం లేదు. ఇదిగో అక్షరజ్యోతి ఫోన్ నెంబర్! సిటీబస్ వెనక రాసి ఉంటే నోట్ చేసుకున్నాను. మనం ఈ నెంబర్‌కి ఫోన్‌చేసి కనుక్కుంటే మనం ఈ కార్యక్రమం ఎలా అమలు జరపాలి. అదే విషయం వారు చెపుతారు" అన్నాడు శాయిరామ్.

"అయితే పదండి ఫోన్ చేద్దాం"

అందరం బయలుదేరబోతుంటే పార్వతీదేవి మంచి రోజు చూసి ఆ పని ప్రారంభిం చాలని గొడవ పెట్టిందిగానీ ఎదుటివాడికి చదువు చెప్పాలనే మా 'కసి' ముందు ఆమె తీర్మానం నెగ్గలేదు.

అందరం మా కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన టెలిఫోన్ కౌంటర్ దగ్గరకు నడిచాం.

"నెంబరెంత?" అడిగాడు రంగారెడ్డి.

"236951" చెప్పాడు శాయిరామ్.

ఆ నెంబర్ రింగ్‌చేసి వెంటనే కంగారుగా రిసీవర్ పెట్టేశాడతను.

"ఏమిటి? రాంగ్‌నెంబరా?" అడిగాడు గోపాల్రావ్.

"కాదు! 'అక్షరజ్యోతి' అనే అన్నాడు అవతలతను.

"అయితే మరెందుకు పెట్టేశావ్? అదేగా మనక్కావలసింది?" ఆశ్చర్యంతో అడిగాము మేము.

సాధారణంగా మొదట ఏ నెంబర్ కొట్టినా రాంగ్ నెంబర్ వెళ్తుంది కదా– ఆ అలవాటు చొప్పున ఇంకే నెంబర్ కయినా వెళ్తుందేమో అనుకున్నాను. కానీ మనం అక్షరజ్యోతికి రింగ్ చేస్తే అక్షరజ్యోతే ఫోనులో కొచ్చేసరికి షాక్ తగిలినట్లయి కంగారుగా ఫోన్ పెట్టేశాను.

అందరూ అతని అర్థం చేసుకున్నారు.

"నిజమే! అలా సడెన్‌గా మనం రింగ్ చేసిన నెంబరే పలుకుతే చాలా షాకింగ్‌గా వుంటుంది. కొంచెం వీక్‌గా ఉన్న హార్ట్ పేషెంట్స్ అయితే ఎగిరి పోతారసలు'

ఈసారి నేను అక్షరజ్యోతికి రింగ్ చేశాను.

"హల్లో అక్షరజ్యోతి హియర్" అన్నాడు ఫోన్ కవతలివేపు నుంచీ.

"హల్లో సర్. మేము నిర్భయ్‌నగర్ కాలనీ వాళ్ళం మాట్లాడుతున్నాం"

"ఏం కావాలి మీకు?"

"అదేనండీ! మేమంతా చదువురాని వాళ్ళందరికీ చదువు చెప్పి మన ప్రభుత్వానికి సహాయం చేయాలనుకుంటున్నాం. మీ స్కీమ్ వివరాలేమిటో చెపితే?"

"ఆ స్కీమ్‌లో ముందు కండిషనేమిటంటే ముందు అసలు మీకు కొద్దో గొప్పో చదువొచ్చి. ఉండాలండీ! మరి మీ వాళ్ళకి. ఆ అర్హత ఉందా?"

"ఓ మా కాలనీ అంతా కూడా ఎడ్యుకేటెడేలెండి. లేకపోతే గవర్నమెంట్ జాబ్స్ ఎట్లా చేస్తాం?"

"ఓ! అలాగా! అయితే సరే! నెక్స్ట్ మీరు చేయాల్సిందేమిటంటే మీ కాలనీకి చుట్టు పక్కలున్న పదిమంది నిరక్షరాస్యులను వెతికి పట్టుకోవాలి. వాళ్ళ వయసు పదిహేనూ ముప్పై మధ్య ఉండాలి. సాయంత్రం సమయాల్లో మీరీ క్లాసులు కండక్ట్ చేయాల్సుంటు ందన్నమాట. ముందు వాళ్ళకు చదువెలా చెప్పాలీ అనే విషయం గురించి మేము మీకు నాలుగు రోజులు ట్రైనింగ్ ఇస్తాం! మీక్కావలసిన మెటీరియల్ కూడా ఇస్తాం. మీ ఇంటి నెంబర్లు, పేర్లు, చిరునామాలు చెపితే మీరు ఎప్పుడు ట్రైనింగ్‌కి రావలసిందీ మేమే పోస్ట్ కార్డ్ ద్వారా ఇంటిమేషన్ పంపుతాం!"

"ఐసీ! అయితే మేమే స్వయంగా మీ ఆఫీసుకొచ్చి కనుక్కుంటాంలెండి"

అందరికీ ఆ వివరాలు చెప్పాను.

నిరక్షరాస్యులను చదువు చెప్పాలంటే ముందు మేము నాలుగు రోజులు ట్రయినింగ్ తీసుకోవాలి అనేసరికి మా లిస్ట్‌లో సగం మంది జారిపోయారు.

"చూడుగురూ! నువ్వేమయినా చెప్పు. నన్ను ఏదైనా సరే గవర్నమెంట్ ఆఫీస్ కెళ్ళమని

మాత్రం చెప్పకు. నా మీదేమయినా పగ ఉంటే నన్ను నరుకు. చెప్పు తీసుకుని కొట్టు అంతేకాని గవర్నమెంట్ ఆఫీస్‌కి వెళ్ళమని మాత్రం చెప్పకు" అన్నాడు జనార్ధన్.

"ఆ మాట నిజమే! లక్ష ప్రయివేట్ కంపెనీలకెళ్ళి పనులు చేసుకురమ్మంటే చేసుకొస్తాం గాని ఒక్క గవర్నమెంట్ డీలింగ్ కూడా మా వల్లకాదు మా కొద్దసలు" అన్నారు మిగతా వాళ్ళు కూడా!

"మా పెదనాన్నగారు గవర్నమెంట్ ఆఫీస్‌లో పాపం ఏదో చిన్న పనిపడి దాని కోసం తిరిగి తిరిగి కదా చివరకు ఆ ఆఫీస్ వరండాలో చనిపోయాడు" అంది పార్వతీదేవి.

"ష్! మరీ అలా మాట్లాడకండి! మనలో కూడా గవర్నమెంట్ సర్వెంట్స్ వున్నారు" అన్నాడు రంగారెడ్డి.

ఆ విషయం అప్పుడు గుర్తుకొచ్చి టక్కున ఆ టాపిక్ మాట్లాడటం మానేశాం అందరం.

"అయినా ఇంకొకడికి చదువు చెప్పడానికి గవర్నమెంటెందుకు మధ్యలో? మనమే మనచుట్టు పక్కల ఉన్న కొంతమంది చదువురాని వాళ్ళను తీసుకొచ్చి వాళ్ళను అక్షరాస్యులను చేసేద్దాం" అంది పార్వతీ దేవి.

"అవును అదే మంచిది"

అందరం అప్పటికప్పుడే నిరక్షరాస్యులను వెతకటానికి టార్చ్ లైట్లు తీసుకుని బయల్దేరాం.

మా కాలనీకి దగ్గరిలోనే ఉన్న సంజయ్‌నగర్ గుడిశెల సంఘంలో చాలామంది నిరక్షరాస్యులుంటారని మాకు తెలుసు.

మమ్మల్ని చూడగానే గుడిశెల వాళ్ళందరూ పరుగుతో వచ్చి చుట్టుముట్టేశారు. అందరి ముఖాల్లోనూ ఆనందం.

"సార్! మాకియ్యండ్రిసార్! గరీబోండ్లున్నాము జమానా కెళ్ళి ఓట్లు మీకే వేస్తున్నాము"

మాకు ఆశ్చర్యంతో నోటమాటరాలేదు.

"ఏమిటీ మీ కిమ్మంటున్నారు" అడిగాడు రంగారెడ్డి.

"అదేసార్! ఐదువేలు పుక్కట్ లోన్ ఇస్తనికి వచ్చిన్రు గద్సార్ మీరు– బాంకోళ్ళకు అప్పు గురించి రాసిచ్చి సంవత్సరమైపాయె సార్–"

మాకు అప్పుడు అర్థమైంది.

సాధారణంగా ప్రతి ఎలక్షన్ ముందూ గవర్నమెంట్ అలాంటి ఓటు బాంక్ అందరికీ తలో ఐదువేలు అప్పు ఉచితంగా ఇస్తూండటం పరిపాటి.

ముఖ్యంగా జనార్ధన్ పూజారి చేసిన పని ఇది.

రంగారెడ్డి నవ్వాడు బిగ్గరగా!

"అమ్మా! మీ అందరికీ ఫ్రీగా బాంక్‌ల ద్వారా అప్పులిప్పించిన జనార్ధన్ పూజారి వల్ల బంగారం మొత్తం అమ్ముకునే స్థితికొచ్చిందమ్మా మనదేశం– ఇంకా ఫుక్కట్ లోన్లు ఆపరా మీరు?"

మేము లోన్‌లు ఇచ్చేవాళ్ళం కాదని తెలీగానే క్షణాల్లో మమ్మల్ని వదిలి ఎవరి ఇళ్ళలోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

మేము గత్యంతరం లేక మరికొన్ని గుడిసెల దగ్గరకు వెళ్ళి అందరినీ బయటకు పిలిచాము.

అది సాయంత్రం టైమవటంతో చాలామంది గుడిసెల ముందే కూర్చుని గుడంబా తాగుతున్నారు.

"ఏం గావాలి మీకు?" ఒకతను తాగటం ఆపి మావేపు చూశాడు.

"ఈ ఏరియాలో చదువురాని వారిందరికి కనీసం రాయటం, చదవటం నేర్పిస్తాం" అన్నాడు రంగారెడ్డి.

"దేన్ని గురించి జేస్తున్రిదంతా?" అడిగాడింకొకతను.

"మా దగ్గర చదువు నేర్చుకుంటే మీ అందరూ ఇకనుంచి వేలి ముద్ర వేయకుండా మీ సంతకాలు మీరే చేయవచ్చు" అంది పార్వతీదేవి.

వాళ్ళు ముఖాలు చూసుకున్నారు.

"ఏదైతే ఏమయింది? అంగూఠా బదులు దస్తఖత్ జేస్తే మాకేమైనా ఫాయిదా ఉంటదా?" వాళ్ళ ప్రశ్నకు ఏం సమాధానం చెప్పాలో మాకు అర్థం కాలేదు.

"అదేం వుండదుగానీ– అలా చేస్తే చాలా బాగుందన్నమాట! అలా అందరూ సంతకాలు చేయటం నేర్చుకుంటే మన రాష్ట్రంలో అందరూ చదువుకున్న వారికింద లెక్కన్నమాట."

"రాష్ట్రంలో అందరూ సదువుకున్నోళ్ళుంటే ఫాయిదా ఏమైనా వుంటుందాసార్ మనకి?"

ఆ ప్రశ్నకు నాకు సమాధానం దొరకలేదు.

"అంటే ఇంతకాలం అది మంచిగ పని జేయలేదా సార్?"

"పన్జేస్తే ఇప్పుడు విదేశాలకు బంగారం ఎందుకమ్ముకుంటాం? ప్రజల్లో, రాజకీయ నాయకుల్లో చదువు లేకపోవటం వల్లే మన గతి ఇట్ల తయారయింది" అన్నాడు రంగారెడ్డి.

"అంతేకాదు భయ్! సదువు లేనందువల్లే లీడర్లు మన ఓట్లు గిట్ట పైసలిచ్చి కొని గెలుస్తున్నట్లు!" అన్నాడు యాదగిరి.

"మళ్ళా ఏమ్మే చదివి లేక్చరర్ ఉద్యోగం జేస్తున్న భీమ్‌రెడ్డి సాబ్ కూడా పైసల్దీసుకుని

ఓటేసిండు గద్సార్ మొన్నా?" ఎవరో అడిగారు.

మాకు మళ్ళీ గొంతు నొక్కుకు పోయింది.

అందరం ఆ ప్రశ్న విననట్లు నటించాం.

ఓట్లు అమ్ముకోవడానికి బీదతనం కారణమనీ, చదువుకోవడం చదువుకోకపోవడం కారణం కాదనీ అర్థమయింది మాకు అప్పుడే!

"సరే! గదంతా మంచిగానే వుందిసార్! మరిప్పుడు ఈ సదువుకి పైసల్సంగతేంది?"

అందరూ అతని వంక అభినందిస్తూ చూశాం!

శాయిరామ్ అతనికి ధైర్యం చెపుతున్నట్లు భుజం తట్టాడు.

"పిచ్చివాడా! మేం కసాయి వాళ్ళం కాదు. మీలాంటి బీదల దగ్గర పైసలు తీసుకొని చదువు చెప్తామనుకుంటున్నారా! మేం సమాజం కోసం ఈ పని చేపట్టాం! మన రాష్ట్రంలో నూటికి నూరుపాళ్ళు అక్షరాస్యత సాధించాలనేది మా ధ్యేయం." అన్నాడు ఉత్సాహంగా.

అతను మావంక పిచ్చోళ్ళను చూసినట్లు చూసాడు.

"నేననెడిది అదిగాద్సార్! మీరు మాకు పైసలిచ్చెడి సంగతి! మీ దగ్గర సదువు గిట్ట నేర్చినందుకు మాకేమిస్తవ్?"

అతని ప్రశ్న మాకు మతిపోగొట్టింది.

"మీకు చదువు చెప్పినందుకు మేము మీకు పైసలివ్వాలా?" షాక్ నుంచి తేరుకుంటూ అడిగాడు జనార్ధన్.

"అవ్ సార్! ఇయాళ్రేపు ఏపనయినాగానీ పైసల్లేకుండా ఎవళ్ళు జేస్తార్సార్."

రంగారెడ్డి రంగంలోకి దిగాడు.

"ఇదిగో నీ పేరేంటి బాబూ?"

"నర్సింహ సార్"

"చూడు నర్సింహా! చదువు రోజంతా నేర్చుకోరు కదా మీరు. మీ పనులు మీరు రోజంతా చేసుకుని సాయంత్రం రెండు గంటలు చదువు నేర్చుకుంటారన్నమాట! దీనికి పైసలడగటం తప్పుకదూ?"

"ఇగో సార్! ఈ నకరాలన్నీ మనదగ్గర నడవయ్! మాకు ఊరికే మీరెందుకు సదువు జెప్తారు సార్! మీరేం పాగల్ గాళ్ళా? గవర్నమెంట్ దగ్గరో, లేకుంటే ఇంకెవళ్ళ దగ్గరో మంచిగ పైసలు కమాయిస్తారు. మాకెరుక లేదా సార్! మా గుడిసెలోళ్ళ పేరు జెప్పుకొని ఎంతమంది ఎన్ని పైసలు కమయించలేద్సార్! అన్నీ మా కెరుకే సార్! సంతకం జేయడానికి రాదుగాని దునియా తెల్సుసార్ మాకు! టైమ్ వేస్టెందుకు గ్గానీ– మేం వందమందున్నాం. అందరం మంచిగ మీరెట్ల జెప్తే అట్ల సదువు నేర్చుకుంటం! మాకు ఎన్ని పైసలిస్తారో

జెప్పండ్రి!"

అప్పటికే అక్కడ మరో వందమంది పోగయిపోయారు.

నేను రంగారెడ్డి వైపు చూసాను.

"మనం ఏం చెప్పినా వాళ్ళు నమ్మరు! అందుకని ఎంతోకొంత డబ్బిచ్చేసి వాళ్ళను అక్షరాస్యులిగా చేయటమే మంచిది" అన్నాను.

"అవును! మన కాలనీలో చదువు చెప్పాలని ఉత్సాహపడుతున్న వాళ్ళంతా పాపం- నిరుత్సాహ పడిపోతారు" అన్నాడు శాయిరామ్.

"అదీగాక మన రాష్ట్రాన్ని నూరుశాతం అక్షరాస్యత గల రాష్ట్రంగా మార్చే అవకాశం పోగొట్టుకుంటాం" అన్నాన్నేను.

"సరే పైసలెన్ని ఇవ్వాలి?" అడిగాడు రంగారెడ్డి.

నర్సింహ తల గోక్కున్నాడు.

"ఒక్కొక్కనికి దినానికి ఇరవై రూపాయలివ్వండి- పిల్లగాండ్లకు పదిరూపాయలిస్తే చాలు."

అందరం ఉలిక్కిపడ్డాం-

"రోజుకి ఒక్కొక్కళ్ళకు ఇరవై రూపాయాలా?"

"అవ్ సార్! సాయంత్రం కూలిపనికెళ్ళొచ్చినాంక రెండు మూడు గంటలు పనిజేయాలె! మళ్ళా అదిగూడా కాళ్లతో, చేతులతో చేసిడి పని కాదు దమాక్ తోటి పని జేయాల! మెదడు తోటి రెండు గంటలు పనిజేయించాలంటే తక్కువ పనాసార్ అది? మేం పనిజేయాలె- మా మెదడు తోటి గూడా మేమే పని జేయించాలే! అక్కడికీ ఇద్దరి కూలీ అవుతున్నది గద్సార్!"

నేను రంగారెడ్డిని పక్కకు పిలిచాను.

"రెడ్డీ! వెంటనే వాడడిగింది ఒప్పేసుకో! లేపోతే వాడికీ వాడి మెదడుకీ ఇద్దరికీ చెరో ఇరవై ఇమ్మని అడుగుతాడు" అన్నాడు రహస్యంగా. రంగారెడ్డి ఒప్పుకున్నాడు.

"సరే భయ్! రేపు సాయంత్రం నుంచీ రోజూ మేమంతా ఇక్కడికి వచ్చి మీకు చదువు చెప్తాం! మీరంతా పదిమంది చొప్పున పది బాచీలు- ఇక్కడ రడీగా ఉండాలి. ఆరింటికల్లా- సరేనా?"

నర్సింహ మొఖంలో ఆనందం కనిపించింది.

"అలాగే సార్! పైసల్దీసుకున్నాక ఇక పని జేయకుండ ఎట్లుంటాం సార్! గసంటి దోకాబాజ్ మనతాన లేద్సార్! ఇప్పుడు ఒక్కరోజు జీతం అందరికీ అడ్వాన్స్ ఇయ్యండ్రి!"

మేము గతుక్కు మన్నాము.

"అడ్వాన్సా? అడ్వాన్సెందుకు?"

"లేకుంటే ఎట్లా సార్? మీరు రేపు రాకపోతే ఎంత నుక్సాన్ సార్?"

"అదేమిటి మేం రాకపోయినా మీకు నష్టమేముంది?"

"మీ మాట ఇని– మేం వేరే వాండ్లెవరైనా సదువు జెప్పనికొస్తే మా బేరం పోగొట్టు కుంటాం గద్సార్? న్యాయం ఆలోచించాలే!'

మాలో చాలా మందికి చెమటలు పట్టినయ్! కర్చీఫ్ తీసి మొఖాలు తుడుచుకున్నాం.

"ఇచ్చేసేద్దామా?" అడిగాడు రంగారెడ్డి పార్వతీదేవి వైపు చూస్తూ.

"ఇచ్చేద్దాం" అంది పార్వతీదేవి.

"తప్పేదేముంది?"

"దీనికి సోంచాయిస్తారేం సార్? ఈ అక్షరజ్యోతి దిక్కుకెళ్ళి మాలాంటోళ్ళకు మంచి డిమాండున్నది సార్ ఇయాళ్రేపు! ఇయాళ అడ్వాన్స్ ఇయ్యకపోతే రేపు వేరే వాండ్ల దగ్గరజేరిపోతాం!" దబాయింపుగా అన్నాడు నర్సింహ.

మేము కిక్కురుమనకుండా అందరం తలో ఇరవై తీసి వాళ్ళకిచ్చాం.

"మిగతా అందరికీ రేపిస్తాం– ఇక్కడున్న పదిమందికీ మాత్రం ఇవాళ ఇస్తున్నాం" చెప్పాడు రంగారెడ్డి.

నర్సింహ ఒప్పుకున్నాడు.

అందరం ఆనందంగా కాలనీకి చేరుకున్నాం.

చదువు చెప్పాలంటే ఒక్కొక్కరూ రోజుకి ఇరవై రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందనేసరికి చదువు చెప్తాననే వాలంటీర్లసంఖ్య పూర్తిగా పడిపోయింది.

కేవలం మా కమిటీ సభ్యులం మాత్రమే మిగిలాం! తెల్లారేసరికి వాళ్ళల్లో కూడా కొంతమంది మాయమైపోయి– చివరకు నేనూ రంగారెడ్డి మాత్రమే ఆ పదిమందినీ అక్షరాస్యులుగా చేయడానికి నిర్ణయించుకున్నాం!

మర్నాడు మేము వెళ్ళేసరికి నర్సింహ తాలూకు గ్రూప్ వాళ్ళందరూ సిద్ధంగా కూర్చుని వున్నారు. అందరికీ పలకలూ, బలపాలూ ఇచ్చి అ ఆ ఇ ఈ లు రాయించటం ప్రారంభించాం!

పది నిముషాలు దిద్దగానే నర్సింహ గుడిశెలో కెళ్ళి గుడంబా సీసా తీసుకొచ్చాడు.

అందరూ తలో గ్లాసులో పోసుకొంటూంటే మాకు భయం వేసింది.

"అదేమిటి? చదువు అయేవరకూ తాగకూడదు" అన్నాడు రంగారెడ్డి.

"ఇగో సార్! ఈ నకరాలు మన దగ్గర నడవయ్! తాగొద్దంటానికి నువ్వెవళ్ సార్? నా పైసల్తో నేన్తాగుత! ఇష్టముంటే సదువు చెప్పు– లేకుంటే పో–"

అందరూ తలో గ్లాసు తాగేశారు.

"ఆ ఇప్పుడు జెప్పు సార్! 'అ ఆ ఇ ఈ' సూడకుండా రాయాలి. గంతనే గదా?" అడిగాడు నర్సింహ.

"అవును-"

అతను రాసి తీసుకుకొచ్చి చూపించాడు.

ఆ అక్షరాలేమిటో నాకర్థం కాలేదు. ఎందుకంటే అవి తెలుగులిపిలో లేవు-

"ఇట్లా కాదు" అంటూ రంగారెడ్డి మళ్ళీ రాసిచ్చాడు అందరికీ-

సరిగ్గా పదినిమిషాల్లో ఓ మనిషి ఇంకో బాటిల్ తీసుకొచ్చి నర్సింహకిచ్చి పైసలు తీసుకు వెళ్ళిపోయాడు.

మళ్ళీ అందరూ తలో గ్లాసూ తాగారు.

ఈ సారి పలకల మీద అ ఆ ఇ ఈ లంటూ ఏవో పిచ్చి బొమ్మలు గీసుకొచ్చి చూపించారు. మరో పది నిమిషాల్లో మళ్ళీ అదే వ్యక్తి గుడంబా బాటిల్ తీసుకొచ్చి నర్సింహ కిచ్చాడు.

"ఏయ్- ఏమిటిది? ఓ పక్కన మేం వీళ్ళకు చదువు చెప్తూంటే నువ్వు బాటిల్స్ తెచ్చిస్తే ఎలా? వీళ్ళింక ఏం చదువుకుంటారు?" అడిగాడు రంగారెడ్డి.

అతను మావేపు కోపంగా చూశాడు.

"ఏయ్ పోన్లేగదాని ఇడుస్తున్న! లేకుంటే మిమ్మల్ని అప్పుడే తన్ని ఇంటికి పంపుతుండె! మీదిక్కు కెళ్ళి అళ్ళు గుడంబ బంద్‌జేస్తే నష్టం ఎవరికి? మాకా, మీకా? నీయవ్వ- మా సేఠ్ గవర్నమెంట్‌కి సంవత్సరానికి ఎంత కట్టాలో ఎరుకనా? నాలుగు నక్షలు బే! నీ తాతిస్తాడా అంత సొమ్ము- అక్షరజ్యోతంట అక్షరజ్యోతి- సాలె- రేపటికెళ్ళి ఈడ కనిపించొద్దు మళ్ళా- కాళ్ళు చేతులు ఇరుస్తా- సాలెగాండ్లు - తిని తిన్నగ ఉండనికి కాదు బాడుకవ్ లకి-" అనేసి వెళ్ళిపోయాడతను

మా మొఖాలు అవమానంతో ఎర్రబడి పోయినయ్.

అప్పటికే వాళ్ళు మూడో బాటిల్ ఖాళీచేసేశారు. పక్కనే టీవీలో వస్తున్న సినిమా చూడ్డాని కెళ్ళారు కొందరు.

చేతిలో పలకలు విసిరిపారేసి కిందపడిపోయాడొకడు. రెండోవాడు మూడోవాడి చొక్కా పట్టుకని లింగయ్య అనేవాడు పెళ్ళిలో తనకు చేసిన మోసం గురించి ప్రతీకారం తీర్చుకోడానికి సిద్ధంగా ఉన్నాడు.

అక్కడున్న ఆడాళ్లిద్దరూ కూడా నిషా ఎక్కువైపోయి ఏమిటేమిటో మాట్లాడుతున్నారు. చేసేది లేక ఆ పూటకు చదువాపేసి మర్నాడు మళ్ళీ వెళ్ళాం. అందరూ వీసీఆర్‌లో

కాసెట్ వేసుకుని సినిమా చూస్తున్నారు. మళ్ళీ మూడో బాటిల్ వచ్చేసరికి తిరిగి వచ్చేశాం.

ఇలాగే తొమ్మిది రోజులూ గడిచిపోయింది.

"ఇలాక్కాదు గానీ ముందు వీళ్ళకు సంతకం నేర్చుదాం" అన్నాడు రంగారెడ్డి. "వీళ్ళ పేర్లు వీళ్ళు చదువుకుని సంతకం చేస్తే చాలు ఇంకేమీ నేర్పటం మన వల్లకాదు–"

ఇద్దరం కలసి మూడో బాటిల్ వచ్చే లోపలే వాళ్ళ సంతకాలు చేయటం నేర్పించి, వాళ్ళ పేరు మేము రాస్తే చదవటం నేర్పించాము కానీ మూడో బాటిల్ తాగేస్తే అదంతా మర్చిపోయి మళ్ళీ పిచ్చి బొమ్మలు. గీతలూ గీసి డాన్స్ చేస్తారని మాకు తెలుసు– ఏమయితేనేం? మాకు బ్రహ్మానందం కలిగింది– మాటార్గెట్ పూర్తయినందుకు–

వెంటనే వాళ్ళందరితో గ్రూప్ ఫోటో దిగి మర్నాడు కలెక్టరాఫీసుకి చేరుకున్నాం. మేము చేసిన ఘనకార్యం చెప్పగానే మా మాటలు వారికి అర్థం కాకపోవటంతో ఆశ్చర్యంగా కాగితం మీద రాసిచ్చాం! ఆ వివరాలన్నీ రిజిస్టర్‌లో రాసుకున్నారు వాళ్ళు. మాకు త్వరలో సర్టిఫికెట్స్ కూడా ఇస్తామని చెప్పారు రాత ద్వారా!

మేము తిరిగి వస్తుంటే టాంక్‌బండ్ మీద కొన్ని లక్షల ఖర్చుతో ముందు గాస్‌తోనూ తరువాత కరెంటుతోనూ వెలుగుతున్న అక్షరజ్యోతి కనిపించింది.

కొన్ని లక్షల రూపాయలతో నగరమంతటా రాయించిన హోర్డింగ్స్ కనిపించినయ్.

కొన్ని కోట్ల రూపాయల ఖర్చుతో ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు టీవీ రేడియోల్లో కనబడుతూ వినబడుతున్నయ్.

కొన్ని లక్షల రూపాయల ఖర్చుతో అక్షరజ్యోతి పేరు మీద జరుగుతున్న సభలూ, సమావేశాలూ, కాన్ఫరెన్స్‌లూ– దారిపొడుగూతూ కనబడుతూనే ఉన్నాయ్.

"అక్షరజ్యోతి ముసుగులో ఎంత డబ్బు ఎవరెవరు కొల్లగొడుతున్నారో చూడు!" అన్నాడు రంగారెడ్డి.

"ఈ లెక్కలో మన రాష్ట్రం నూటికినూరు శాతం అక్షరాస్యత సాధించే– రోజు ఎంతో దూరంలో లేదు–" అన్నాన్నేను.

ఇద్దరం కాలనీ చేరుకున్నాం

మేము విజయవంతంగా మా స్కీమ్ అమలు జరిపినందుకు కాలనీలో మా కోసం అభినందన సభ ఏర్పాటు చేశారు.

నేనూ రంగారెడ్డి వేదిక మీదకు రాగానే దండలు వేశారు మెడలో, అంతా తప్పట్లు కొట్టారు.

మేము మైక్ ముందుకెళ్ళి మాట్లాడే సమయం వచ్చింది. ముందు రంగారెడ్డి వెళ్ళి మాట్లాడసాగాడు.




అతని మాటలు నాకర్థం అవసాగినయ్ గానీ మిగతా వారెవ్వరికీ అర్థంకావటంలేదు.

"తెలుగులో మాట్లాడు" అంటూ కేకలు వేయసాగారు.

అది మరీ ఆశ్చర్యం కలిగించింది నాకు. ఎందుకంటే అతను తెలుగులోనే మాట్లాడుతున్నాడు. మళ్ళీ మాట్లాడ్డానికి ప్రయత్నించాడు రంగారెడ్డి. ఈసారి అతనికి మాటకూడా సరిగ్గా రావటం లేదు. దాంతో అతనిని పక్కన కూర్చోబెట్టి నన్ను మాట్లాడమన్నారు. నేను అక్షరజ్యోతి గురించి ఎంత శ్రమపడ్డామో వివరించటం ప్రారంభించాను గానీ మళ్ళీ కేకలు వినిపించినయ్

"తెలుగులో మాట్లాడు" నాకు అప్పుడర్థమయింది.

చదువు మీద కంటే తాగుడు మీదా, సినిమాల మీదా ఆసక్తి ఉన్న వారికి చదువు నేర్పించేటప్పుడు మనకున్న చదువుకూడా పోయే అవకాశముందని–

అప్పటికప్పుడు నా భార్యా రంగారెడ్డి భార్యా భోరున ఏడుస్తూ వచ్చారు.

మా ఇద్దరికీ పిచ్చి ఎక్కిందేమోనని వారి అభిప్రాయం. మరి కాసేపట్లో డాక్టర్ కూడా వచ్చాడు. మేమేమీ మాట్లాదల్చుకోలేదు.

కొద్ది రోజులు మళ్ళీ మా కాలనీలో గడుపుతే మేము మళ్ళీ మామూలు మనుషులయి పోతామని మాకు తెలుసు.

* * * * *